
సాక్షి గుంటూరు



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 518.50 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 450 క్యూసెక్కులు వదిలారు.



నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

విజయవాడ: ఇంద్రకీలాద్రిపై నిత్యాన్నదానానికి తాడేపల్లికి చెందిన భక్తులు గుడివాక జయదేవ్ సూర్య, జయసూర్య ఆర్యన్ మంగళవారం రూ. లక్ష విరాళాన్ని అందజేశారు.



నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: తెనాలి మార్కెట్‌యార్డులో మంగళవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.2,200, గరిష్ట ధర రూ.3,700, మోడల్ ధర రూ.2,700 వరకు పలికింది.

న్యూస్‌రీల్

నేడు ఎంపీ విజయసాయిరెడ్డి రాక

సాక్షి ప్రతినిధి, బాపట్ల: రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా రీజినల్ కో–ఆర్డినేటర్ వి.విజయసాయిరెడ్డి బుధవారం బాపట్ల రానున్నారు. పట్టణంలోని కోన భవన్‌లో జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన శాసన సభ్యులు, ఇన్‌చార్జిలతోపాటు ఎంపీలు, మాజీ ఎమ్మెల్యే, ముఖ్య నేతలతో సమావేశం అవుతారు. పార్టీని మరింత బలోపేతం చేసేందుకు అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తారు. భవిష్యత్ కార్యాచరణపై నేతలకు దిశానిర్దేశం చేయనున్నారు.

అందరికీ సంక్షేమ ఫలాలు

బాపట్ల కలెక్టర్ రంజిత్ బాషా



బాపట్ల: సంక్షేమ ఫలాలను ప్రజలందరికీ చేరవేయాల్సిన బాధ్యత ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులపై ఉందని కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టరేట్‌పై జాతీయ జెండాను మంగళవారం ఎగురవేశారు. తొలుత గాంధీజీ చిత్రపటానికి పుష్ప మాలలతో నివాళులర్పించారు. పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించిన తదుపరి అందరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జేసీ శ్రీధర్, జిల్లా రెవెన్యూ అధికారి కె.లక్ష్మీశివజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ బంగ్లాలో తేనీటి విందు



చీరాల అర్బన్: స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా చీరాలలోని కలెక్టర్ బంగ్లాలో మంగళవారం రాత్రి కలెక్టర్ రంజిత్ బాషా తేనీటి విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి చీరాల, బాపట్ల ఎమ్మెల్యేలు కరణం బలరామకృష్ణమూర్తి, కోన రఘుపతి, రాష్ట్ర మార్కెటింగ్, సహకార శాఖ రాష్ట్ర సలహాదారు బత్తుల బ్రహ్మానంద రెడ్డి, వైఎస్సార్ సీపీ చీరాల నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్, జాయింట్ కలెక్టర్ సీహెచ్ శ్రీధర్, జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, అడిషనల్ ఎస్పీ పి.మహేష్ హాజరయ్యారు. జిల్లాలోని వివిధ హోదాలలో ఉన్న నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు రేంజ్‌లో స్వాతంత్ర్యోత్సాహం



నగరంపాలెం(గుంటూరు వెస్ట్): మహానుభావుల త్యాగఫలితమే స్వాతంత్ర్యమని గుంటూరు రేంజ్ ఐజీ పాలరాజు చెప్పారు. మంగళవారం స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గుంటూరు రేంజ్ క్యాంపు కార్యాలయంలో ఐజీ పాలరాజు జాతీయ జెండాను ఎగురవేశారు. ఐజీ మాట్లాడుతూ త్యాగధనుల పోరాట స్ఫూర్తిని కొనియాడారు. ప్రజాసేవకు పోలీసులు పునరంకితం కావాలని సూచించారు. ఏఎస్పీ (ఏఆర్) కోటేశ్వరరావు, డీఎస్పీ చంద్రశేఖర్ పాల్గొన్నారు.


గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో..

గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయంతోపాటు ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ జెండా ఎగురవేశారు. ఏఎస్పీలు కె.కోటేశ్వరరావు (ఏఆర్), డి.ఎస్.మహేష్ (ఎస్ఈబీ) పాల్గొన్నారు.

వీరాంజనేయుడికి వెండి కిరీటం సమర్పణ

పొన్నూరు: స్థానిక ఉండ్రపూడి–పోలవరం అడ్డరోడ్డు వద్ద ఉన్న శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానంలోని స్వామికి దాతలు మంగళవారం వెండి కిరీటాన్ని సమర్పించారని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎల్.సత్యవతి తెలిపారు. గుడివాడకు చెందిన బోయిన వీరరాఘవయ్య దంపతులు రూ.1.35 లక్షలు వెచ్చించి 1.546 కిలోల వెండితో వీరాంజనేయస్వామికి కిరీటాన్ని తయారు చేయించి, ఆలయ కమిటీ చైర్మన్ మట్టా పూర్ణచంద్రరావు, ధర్మకర్తల మండలి సభ్యుడు డి.డి.ప్రసాద్‌కు అందజేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు రామాచార్యులు పాల్గొన్నారు.

ప్రగతి పతాక



జయ జన ధ్వానాలు

జాతీయ జెండాకు వందనం చేస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు, కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, ఎస్పీ ఆరిఫ్ హఫీజ్, జేసీ రాజకుమారి

హరివిల్లులోని సప్తవర్ణాలు మువ్వన్నెల్లో ఒదిగిపోయి మిలామిలా మెరిసినట్టు.. గగనాన జాతీయ పతాక సగర్వంగా రెపరెపలాడింది. నవరత్నాలు పొదిగిన సంక్షేమ వజ్రవైడూర్యాలు నడివీధిలో కవాతు చేసినట్టు.. ప్రగతి రథ చక్రాలు కదంతొక్కుతూ శంఖారావం పూరించాయి. అఖండ భారతావని ఒక్కసారిగా గళమెత్తి గర్జించినట్టు.. జనగణమన నినాదంతో దిక్కులన్నీ మార్మోగాయి. కీర్తిపతాక పిడికిట బిగిసి జయజయజయహే అంటూ గీతాలాపన చేసినట్టు.. అకుంఠిత దేశభక్తితో మంగళవారం ఊరూవాడా మురిశాయి.

సంక్షేమం, అభివృద్ధి పరవళ్లు

- సంతృప్తస్థాయిలో సర్కారు సేవలు
- శరవేగంగా భూరక్ష రీసర్వే
- దిగ్విజయంగా మన బడి నాడు–నేడు
- గృహాల నిర్మాణం వేగవంతం
- ఆగస్టు నెలాఖరుకు 12,490 ఇళ్ల నిర్మాణం పూర్తి
- స్వాతంత్ర్య వేడుకల్లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి ధర్మాన ప్రసాదరావు



సందేశం ఇస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: గుంటూరు జిల్లాలో ప్రగతి పరుగులు తీస్తోందని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, రాష్ట్ర రెవెన్యూ స్టాంప్స్, రిజిస్ట్రేషన్ల శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు చెప్పారు. మంగళవారం స్థానిక పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన స్వాతంత్ర్య వేడుకలలో మంత్రి ధర్మాన ప్రసాదరావు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమంలో గుంటూరు జిల్లా కీలకపాత్ర పోషించిందని కొనియాడారు. జిల్లాలో జరుగుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. కార్యక్రమంలో జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ సభ్యులు డాక్టర్ పీపీ వావా, కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి , జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా, శాసన మండలి సభ్యులు చంద్రగిరి ఏసురత్నం, కేఎస్ లక్ష్మణరావు, శాసన సభ్యులు మద్దాళి గిరిధరరావు, డీసీఎంఎస్ చైర్మన్ భాగ్యలక్ష్మి, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ అనురాధ, ఎస్పీ ఆరిఫ్ హఫీజ్, జేసీ జి.రాజకుమారి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, డీఆర్వో కె.చంద్రశేఖరరావు,, అదనపు ఎస్పీ (పరిపాలన) కె.సుప్రజ పాల్గొన్నారు.

మంత్రి ధర్మాన ప్రసంగంలో ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే..

- 249 రైతు భరోసా కేంద్రాల ద్వారా ఖరీఫ్ సీజన్‌లో 3,018 క్వింటాళ్ల విత్తనాలు, 22,754 టన్నుల ఎరువుల సరఫరాకు ప్రణాళిక సిద్ధం చేశాం.
- డాక్టర్ వైఎస్సార్ యంత్ర సేవా పథకం ద్వారా రూ. 2.34 కోట్ల రాయితీతో 53 ట్రాక్టర్లు, మూడు కంబైన్డ్ హార్వెస్టర్లు, 504 యంత్ర పరికరాలు రైతు గ్రూపులకు అందించాం.



వీరమాతలను సన్మానిస్తున్న ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ చిత్రంలో మంత్రి ధర్మాన ప్రసాదరావు, కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, జేసీ రాజకుమారి

- 9,402 టన్నుల మొక్కజొన్న, శనగలను రూ. 24.21 కోట్లతో ఆర్బీకేల నుంచి సేకరించాం.
- డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బీమా ద్వారా 14,542 మంది రైతులకు రూ. 4.16 కోట్లు పరిహారం అందించాం.
- వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్ పథకం ద్వారా 1.22 లక్షల మందికి రూ. 92 కోట్లు లబ్ధి చేకూర్చాం.



జాతీయ పతాకాలతో మహిళా ఉద్యోగుల ప్రదర్శన

- 33వేల మంది కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులు అందజేసి రూ.14.52 కోట్లు పంట రుణాలు అందించాం.
- డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా నాలుగేళ్లల్లో రూ.570 కోట్లతో 2.46 లక్షల మంది రోగులకు శస్త్రచికిత్సలు చేయించాం.
- వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా 1.08 లక్షల మంది రోగులకు రూ.59 కోట్ల సాయం అందించాం.
- జగనన్న అమ్మఒడి పథకం ద్వారా ఈ ఏడాది 1.59 లక్షల మందికి రూ.239.39 కోట్లు ప్రయోజనం చేకూర్చాం.
- మనబడి – నాడు నేడు రెండోదశలో 561 పాఠశాలలను రూ.215 కోట్లతో ఆధునికీకరించాం.
- 1,073 పాఠశాలల్లో 1.06 లక్షల మంది విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు సరఫరా చేశాం.
- డిజిటల్ విద్యలో భాగంగా 85 ప్రభుత్వ పాఠశాలల్లో 620 ఇంట్రాక్టివ్ ఫ్లాట్‌ప్యానల్స్, 130 పాఠశాలల్లో 178 స్మార్ట్ టీవీలు సమకూర్చాం.
- పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా 209 వైఎస్సార్ జగనన్న కాలనీల్లో రూ.1,268 కోట్లతో 70,444 గృహాల నిర్మాణం చేపట్టాం. మౌలిక సదుపాయాల కోసం రూ.74.61 కోట్లు ఖర్చు చేస్తున్నాం.
- 12,490 గృహాలు ఆగస్టు చివరి నాటికి పూర్తి చేస్తాం.
- 2023–24 సంవత్సరానికి 2.11 లక్షల ఎకరాల ఆయకట్టుకు 25.01 టీఎంసీల నీరు ఇస్తాం.
- చిన్ననీటి పారుదల పథకాల ద్వారా 3,794 ఎకరాల ఆయకట్టుకు నీరు ఇచ్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం.
- వైఎస్సార్ జగనన్న భూరక్ష–భూహక్కు పథకం ద్వారా 137 గ్రామాల్లో డ్రోన్ సర్వే పూర్తయింది. 58 గ్రామాలకు ఓఆర్‌ఐలు వచ్చాయి. 23 గ్రామాలకు నోటిఫికేషన్ పూర్తయింది. 29,647 మంది రైతులకు ప్రయోజనం చేకూరింది.
- 68 మందికి కారుణ్య నియామకాలు కల్పించాం.
- ఉపాధి హామీ పథకం ద్వారా 25.27 లక్షల పని దినాలు కల్పించాం. రూ.61 కోట్లు కూలీలకు చెల్లించాం.
- నా భూమి నా దేశం కార్యక్రమంలో భాగంగా 232 గ్రామ పంచాయతీల పరిధిలో నేలతల్లికి వందనం, వీరులకు వందనం కార్యక్రమం చేపట్టి 25 వేల మొక్కలు, వంద ఎకరాల ఉద్యాన తోటల సాగుకు చర్యలు చేపట్టాం.
- రూ. 188 కోట్లతో 825 ప్రభుత్వ ప్రాధాన్య భవనాల నిర్మాణం చేపట్టాం. వీటిలో 178 పూర్తి కాగా, 647 పనులు పురోగతిలో ఉన్నాయి.
- రూ.460 కోట్లతో 432 కిలోమీటర్ల నిడివిగల 69 రహదారుల అభివృద్ధి పనులు చేపట్టాం. రూ. 28 కోట్లతో ఆర్వోబీ పనులు ఆమోదం పొందాయి.

ఆకట్టుకున్న శకటాల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు

అనంతరం వివిధ ప్రభుత్వ శాఖల శకటాలు, స్టాల్స్ ప్రదర్శన ఆద్యంతం ఆకట్టుకుంది. విద్యార్థులు ఇచ్చిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. దేశ సేవలో అమరులైన సైనికుల వీరమాతలు విజయలక్ష్మి, సుబ్బమ్మ, కొల్లి జానకిలను మంత్రి సన్మానించారు. ఇస్రో యంగ్ ఇండియన్ సైంటిస్ట్ పోటీల్లో సత్తాచాటిన ఐదుగురు విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. ఉత్తమ సేవలందించిన ఉద్యోగులు, పోలీసులకు ప్రశంసాపత్రాలు అందించారు.

స్కూలు బస్సు బోల్తా

20 మంది విద్యార్థులకు స్వల్పగాయాలు

వేమూరు: ప్రైవేటు స్కూలు బస్సు అదుపు తప్పి కాలువలో పడింది. ఇరవై మంది విద్యార్థులు స్వల్పంగా గాయపడ్డారు. ఈ ఘటన కూచిపూడి–పెదపూడి మధ్య చోటుచేసుకుంది. వివరాలు.. కూచిపూడి గ్రామంలోని ఓ ప్రైవేటు పాఠశాలకు చెందిన స్కూల్ బస్సు 77వ స్వాతంత్ర్య వేడుకల అనంతరం విద్యార్థులను ఇళ్లకు పంపించేందుకు బయలుదేరింది. బస్సులో పెదపూడి, పెరవలిపాలెం, పెరవలి, చావలి గ్రామాలకు చెందిన 50 మంది విద్యార్థులు ఉన్నారు. బస్సు పెదపూడి వైపు వెళ్తుండగా బస్సు డ్రైవర్ అతివేగంగా నడుపుతూ అదే స్కూలుకు చెందిన మరో బస్సును ఓవర్ టేక్ చేసే క్రమంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. బస్సులోని విద్యార్థుల్లో 20 మంది స్వల్పంగా గాయపడ్డారు. వీరిని తెనాలిలోని ప్రైవేటు హాస్పిటల్‌కు చికిత్స నిమిత్తం తరలించారు. ఘటనా స్థలాన్ని అమృతలూరు ఎస్ఐ సురేష్ పరిశీలించారు. రేపల్లె ఆర్డీఓ ఆర్.పార్థసారథి, అమృతలూరు తహసీల్దార్ మహ్మద్ సుభానీ, ఎంఈఓ కనపాల రమేష్, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించారు. బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు.



కూచిపూడి - పెదపూడి మార్గంలో పడి పోయిన విద్యార్థుల స్కూలు బస్సు

ఏం పాపం చేశానమ్మా..

- మృతశిశువును వదిలేసిన మహిళ
- ఏరియా వైద్యశాలలో వెలుగు చూసిన ఘటన

బాపట్ల: 'నవమాసాలు మోసిన కన్నపేగుకు ఎందుకొచ్చిందమ్మా అంత కాఠిన్యం.. మూడో నెలలో కడుపున పడ్డానని మురిసినపోయిన జ్ఞాపకం నాకు గుర్తుందమ్మా.. ఆరో నెలలో నా కదలికలకు ఉప్పొంగిన నీ గుండెల్లో సంబరం ఎలా మరిచిపోతానమ్మా.. తొమ్మిదో నెలలో శూలం వేసి పొడుస్తున్నట్లు పురిటి నొప్పులొచ్చినా భరించిన నీవు.. నన్ను చూసి రాల్చిన ఆనందబాష్పాల తడి నా శరీరంపై ఇంకా అలానే ఉందమ్మా.. నీ ఊపిరితో భూమిపైకి వస్తే.. కనుగుడ్లు కూడా తెరవకముందే కానరాని లోకాలకు పంపించావా.. అయినా నీ మీద నాకు కోపం లేదమ్మా.. ఎందుకంటే నీవు మా అమ్మవు..' బాపట్లలో అప్పుడే పుట్టిన మగశిశువును ఓ తల్లి మరుగుదొడ్డిలో పడేసింది. డీఎస్పీ టి.వెంకటేశులు అందించిన వివరాలు.. బాపట్లలోని ఏరియా వైద్యశాలకు సోమవారం ఉదయం 6.30 గంటల సమయంలో 20 నుంచి 22 సంవత్సరాల గర్భిణి హాస్పిటల్‌కు వచ్చింది. అక్కడ ఉన్న కంపౌండర్‌ను కడుపులో నొప్పిగా ఉంది మరుగుదొడ్డి ఎక్కడ అని అడిగింది. మరుగుదొడ్డి చూపించి వెళ్లిపోయాడు. తరువాత ఆమె తిరిగి హాస్పిటల్‌లోకి రాకుండా బయటకు వెళ్లిపోయింది. మంగళవారం ఉదయం మరుగుదొడ్డి శుభ్రం చేసేందుకు సిబ్బంది వెళ్లి చూడగా చనిపోయిన మగశిశువును గమనించి వైద్యులకు సమాచారం ఇచ్చారు. వైద్యుల సమాచారంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని డీఎస్పీ టి.వెంకటేశులు తెలిపారు.



మరుగుదొడ్డిలో పడి ఉన్న మగశిశువు మృతదేహం

ఇంటి తాళాలు పగలగొట్టి చోరీ

రూ.పది లక్షల విలువైన బంగారం, నగదు అపహరణ

చేబ్రోలు: దైవ దర్శనం కోసం వెళ్లిన కొబ్బరి బోండాల వ్యాపారి ఇంటిలో దొంగలు చోరీకి తెగబడ్డారు. వడ్లమూడి గరువుపాలెంలో జరిగిన ఈ ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. వడ్లమూడి గరువుపాలెం ప్రాంతానికి చెందిన కొబ్బరిబొండాల వ్యాపారి ఉయ్యూరు వెంకటేశ్వరరావు రెండు రోజుల క్రితం కుటుంబ సభ్యులతో కలిసి శ్రీశైలం వెళ్లారు. సోమవారం ఇంటికి వచ్చిన వెంకటేశ్వరావు కుటుంబ సభ్యులు ఇంటి తలుపులు, కిటికీలు విరగగొట్టి ఉండడంతో లోపలకు వెళ్లి చూశారు. రెండు బీరువాలలోని రూ.2.10 లక్షల నగదు, 14 సవర్ల బంగారం, వెండి వస్తువులు కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ కె.ఆనంద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గుంటూరు నుంచి వచ్చిన క్లూస్ టీం ఆధారాలను సేకరించింది.

త్యాగధనుల స్ఫూర్తి అజరామరం

- కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి
- మంగళగిరిలో వంద అడుగుల జాతీయ పతాకం ఆవిష్కరణ
- పాల్గొన్న ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ హనుమంతరావు

మంగళగిరి: స్వాతంత్ర్య సమరంలో త్యాగాలు చేసిన యోధుల స్ఫూర్తి అజరామరమని కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి చెప్పారు. నగరంలోని నేతన్న సర్కిల్(ఎన్ఆర్ఐ జంక్షన్) మంగళగిరి–తాడేపల్లి నగర ముఖద్వారంలో ఏర్పాటు చేసిన 100 అడుగుల జాతీయ జెండాను మంగళవారం ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే), ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావులతో కలిసి కలెక్టర్ ఎగురవేశారు. తొలుత మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ సేవకు పునరంకితమై స్వాతంత్ర్య స్ఫూర్తితో అందరూ ముందుకెళ్లాలన్నారు. ఈ ఏడాది ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా మన దేశం–మన మట్టి కార్యక్రమాలతోపాటు మరెన్నో కార్యక్రమాలను చేపట్టామన్నారు. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) మాట్లాడుతూ మహాత్మాగాంధీ చూపిన సత్యం, అహింస మార్గాల్లో ప్రజలంతా నడవాలన్నారు. కార్యక్రమంలో ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ మునగాల భాగ్యలక్ష్మి, తహసీల్దార్ జీవీ రామ్ ప్రసాద్, కమిషనర్ యు.శారదాదేవి, అడిషనల్ కమిషనర్ హేమమాలిని తదితరులు పాల్గొన్నారు.



మంగళగిరిలో ఏర్పాటుచేసిన వంద అడుగుల జాతీయ జెండా



జెండాకు వందనం చేస్తున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ హనుమంతరావు

రూ.2 లక్షల విలువైన తెలంగాణ మద్యం స్వాధీనం

పాతనేరస్తుడి అరెస్ట్

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): తెలంగాణకు చెందిన మద్యం సీసాలు తీసుకొచ్చి, విక్రయించే పాత నేరస్తుడిని ఎస్ఈబీ (సెబ్) గుంటూరు–2 పోలీసులు అరెస్ట్ చేశారు. అతని వద్ద రూ.2 లక్షలు ఖరీదు చేసే ఫుల్, క్వార్టర్ బాటిళ్లు, ఆటో సీజ్ చేశారు. ఇన్నర్‌రింగ్ రోడ్‌లోని గుంటూరు–2 ఎస్ఈబీ(సెబ్) స్టేషన్‌లో మంగళవారం జరిగిన విలేకర్ల సమావేశంలో సెబ్ గుంటూరు ఏఎస్పీ డి.ఎన్.మహేష్ కేసు వివరాలను వెల్లడించారు. ఏఎస్పీ కథనం ప్రకారం..

ముందస్తు సమాచారంతో మేడికొండూరు మండలం పేరేచర్ల జంక్షన్ వద్ద మంగళవారం మకాం వేసి, వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో గుంటూరు నగరంలోకి వస్తున్న ఆటోను ఆపి సోదాలు చేశారు. ఆటోలో వెనుక ఉన్న సీటు కింద తెలంగాణ మద్యం సీసాలను గుర్తించారు. నల్లచెరువు ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవర్ ఇంతియాజ్ ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు ప్రయాణికుల ఆటో సీటు అడుగున సీసాల నిల్వకు అనువుగా తయారు చేయించినట్టు తెలుసుకుని పోలీసులు విస్తుపోయారు. ఇంతియాజ్‌ను అరెస్ట్ చేసి, రూ.2 లక్షలు ఖరీదు చేసే 60 ఫుల్ బాటిళ్లు, 47 క్వార్టర్ సీసాలను సీజ్ చేశారు. ఇంతియాజ్‌పై గతంలో లాలాపేట పీఎస్, గుంటూరు–1, నరసరావుపేట ఎస్ఈబీ స్టేషన్లలోనూ కేసులు ఉన్నాయి. ఇతర రాష్ట్రాల మద్యం సీసాలను ఇక్కడకి తీసుకొచ్చి, విక్రయించడం చట్టరీత్యా నేరమని ఏఎస్పీ చెప్పారు. ఇలాంటి నేరాలపై ప్రజలెవరైనా ఎస్ఈబీ టోల్‌ఫ్రీ నంబర్ 14500కు సమాచారం ఇవ్వవచ్చని సూచించారు. సమావేశంలో గుంటూరు– 2 ఎస్ఈబీ స్టేషన్ సీఐ కె.కర్ణ, ఎస్ఐలు ఇ.కల్యాణ చక్రవర్తి, ఎస్.హర్షవర్ధన్‌రెడ్డి, డీఎస్ఈఓ సీఐ సామినేని అంటోనిరాజు, హెచ్‌సీలు పోతురాజు, కె.ప్రేమ్‌కుమార్, కానిస్టేబుళ్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఎస్పీ మహేష్, పక్కన సీఐలు కర్ణ, అంటోనిరాజు

ఆర్టీసీ బస్సులో మహిళపై అసభ్య ప్రవర్తన

ఆకతాయికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన మహిళ బంధువులు

ప్రత్తిపాడు: ఆర్టీసీ బస్సులో ఓ మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్ఐ కథనం ప్రకారం.. ప్రత్తిపాడు మండలం పాతమల్లాయపాలెం ఎస్సీ కాలనీకి చెందిన మహిళ మంగళవారం రాత్రి గుంటూరు నుంచి ప్రత్తిపాడుకు ఆర్టీసీ బస్సులో వస్తున్నారు. అదే బస్సులో చేబ్రోలు మండలం వేజెండ్ల గ్రామానికి చెందిన షేక్ ముసామీన్ కూడా ఎక్కాడు. పుల్లడిగుంట దాటిన తరువాత బస్సులో నిలబడిన ఉన్న ముసామిన్ మహిళతో అసభ్యంగా ప్రవర్తించాడు. ఊహించని పరిణామంతో దిగ్భ్రాంతికి గురైన మహిళ అతడితో గొడవ పడ్డారు. తోటి ప్రయాణికులు కూడా మహిళకు మద్దతుగా నిలిచారు. ముసామీన్ ప్రయాణికులపైనా అనుచితంగా ప్రవర్తించాడు. దూషణలకు దిగాడు. దీంతో మహిళ విషయాన్ని ఫోన్ ద్వారా తన బంధువులకు తెలియజేసింది. బస్సు ప్రత్తిపాడుకు చేరుకునే సమయానికి అక్కడికి చేరుకున్న మహిళ కుటుంబీకులు ఆ వ్యక్తికి దేహశుద్ధి చేశారు. బస్సు నుంచి బయటకు లాక్కొచ్చి చితకబాదారు. అనంతరం ప్రత్తిపాడు పోలీసు స్టేషన్‌కు తీసుకువెళ్లి అప్పగించారు. కేసు నమోదు చేయనున్నట్టు ప్రత్తిపాడు ఎస్ఐ డి.రవీంద్రబాబు తెలిపారు.



పోలీసుల అదుపులో ఉన్న ముసామీన్

ఉత్తమ సేవలకు పురస్కారాలు

గుంటూరు పోలీస్ పేరేడ్ గ్రౌండ్స్‌లో మంగళవారం జరిగిన 77వ స్వాతంత్య్ర వేడుకల్లో మంత్రి ధర్మాన ప్రసాద రావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, సాయుధ పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జిల్లాలో ఉత్తమ సేవలందించిన పలు శాఖల అధికారులకు ప్రశంసా పత్రాల్ని అందించారు.



జిల్లా ఇంచార్జి మంత్రి ధర్మాన ప్రసాదరావు నుంచి ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ



కె.సుప్రజ అడిషనల్ ఎస్పీ; వాసు సీఐ; నరేష్ సీఐ; కె.చంద్రశేఖరరావు డీఆర్వో; ప్రభాకరరెడ్డి గుంటూరు ఆర్డీవో; వెంకటశివరామిరెడ్డి స్పెషల్ డెప్యూటీ కలెక్టర్; పెద్ది రోజా, జీఎంసీ అసిస్టెంట్ కమిషనర్; వెంకటేశ్వర్లు, పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్; మోహన్‌రావు, జెడ్పీ సీఈవో; బ్రహ్మయ్య, ఎస్ఈ, పంచాయతీరాజ్; వై.హరిహరనాథ్, ప్రాజెక్టు డైరెక్టర్ డీఆర్డీఏ



డి.మధుసూదనరావు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి; షేక్ కరీమ్, ఉప రవాణా శాఖ అధికారి; డాక్టర్ భవనం హనుమ శ్రీనివాసరెడ్డి, న్యూరో సర్జన్; వి.వనజ, సహాయ సంచాలకులు, హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్; డాక్టర్ అమర్తలూరి శ్రావణబాబు, డీఎంహెచ్‌వో; పి.కోమలిపద్మ జిల్లాపౌరసరఫరాల అధికారి; పి.వెంకటనారాయణ, ప్రాజెక్టు డైరెక్టర్, మెప్మా; డాక్టర్ జి.సుబ్బారావు, జిల్లా లెప్రసీ అధికారి; టి.ఎం.కె.సుబ్బరాయన్, జిల్లా మలేరియా అధికారి; డాక్టర్ వై.సూర్యవాణి, గుంటూరు జీజీహెచ్ గైనకాలజీ ప్రొఫెసర్; కె.ఆషా సజని, జీజీహెచ్ నర్సింగ్ సూపరింటెండెంట్



డాక్టర్ బి.వెంకట సుధాకర్‌రెడ్డి, జీజీహెచ్ సీఎంవో; దాసరి రోజీరాణి, హెడ్ నర్సు, జీజీహెచ్; చంద్రశేఖర్, బయోమెడికల్ ఇంజనీర్, జీజీహెచ్; వై.లక్ష్మీసామ్రాజ్యం, సీనియర్ అసిస్టెంట్, జీజీహెచ్; డాక్టర్ కోనేరు సుధాకర్, గుంటూరు జీజీహెచ్; డాక్టర్ జి.శ్రీధర్, గుంటూరు మెడికల్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్; డాక్టర్ వి.విజేత, గుంటూరు జీజీహెచ్ ప్రొఫెసర్; కె.రాధాకృష్ణ సీనియర్ అసిస్టెంట్, గుంటూరు మెడికల్ కాలేజీ



కె.వెంకట్రావు, పరిపాలనా అధికారి, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల; డాక్టర్ బాలభాస్కరరావు, జంఝానా కో-ఆర్డినేటర్; నన్నపనేని సదాశివరావు, యడ్లపాటి అశోక్‌కుమార్, నాట్కో ట్రస్టు; టి.వేణుగోపాల్, ప్రాజెక్టు డైరెక్టర్, గృహనిర్మాణ సంస్థ; టి.శ్రీనివాసరావు, ఏడీ, వ్యవసాయశాఖ; కె.రాజకుమారి, ఏపీఎస్ఎస్ఎఫ్‌సీ జిల్లా ప్రాజెక్టు మేనేజర్; వి.నాగేంద్రప్రసాద్, పరిపాలన అధికారి, వ్యవసాయ శాఖ; జి.గౌతం ప్రసన్న, డీఏవో కార్యాలయం, టెక్నికల్ ఏవో; సీహెచ్.పద్మావతి, డీఏవో, ఏపీ టిడ్కో; మాధవి, డీపీఓఆర్‌డీ, అటెండర్; సిద్ధార్థ్, కలెక్టరేట్ సూపరింటెండెంట్; నాగిరెడ్డి, తహసీల్దారు, తాడేపల్లి; కె.గోపాలకృష్ణ, తహసీల్దారు, చేబ్రోలు; ఎ.విజయప్రసాద్, జాయింట్ సబ్ రిజిస్ట్రార్-2 గుంటూరు



షరీఫ్‌బాబు, జాయింట్ సబ్ రిజిస్ట్రార్ -2 మంగళగిరి; రాంబాబు, సీనియర్ అసిస్టెంట్, ఎస్ఆర్‌డీ, గుంటూరు; బోడపాటి జాహ్నవి, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్, రైల్వే కోర్టు; కాసు వెంకటరెడ్డి, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్; కళ్ళం వెంకట రమణారెడ్డి, స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్; చెంగలశెట్టి వెంకట సత్యనారాయణ, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్; ఏఎస్పీ (ఎల్/ఓ) శ్రీనివాసరావు; శ్రీనివాసరావు డీసీఆర్‌బీ డీఎస్పీ; ప్రకాష్‌బాబు డీఎస్పీ క్రైం; జానయ్య డీపీఓ పీఆర్‌ఓ; అన్వర్ బాషా కొత్తపేట పీఎస్ సీఐ; శ్రీహరిరావు విజిలెన్స్ సీఐ; శ్రీనివాస్, నగరపాలక సంస్థ డెప్యూటీ కమిషనర్; సుందరరామిరెడ్డి నగరపాలక సంస్థ ఈఈ

అంతా సోదరభావంతో మెలగాలి: డీఎంహెచ్‌వో



జాతీయ జెండాకు వందన సమర్పణ చేస్తున్న డీఎంహెచ్‌వో, యూనియన్ నేతలు

గుంటూరు మెడికల్: దేశ ప్రజలంతా వివక్షలకు తావు లేకుండా సోదరభావంతో మెలగాలని గుంటూరు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణబాబు తెలిపారు. 77వ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా స్థానిక చంద్రమౌళీ నగర్ జీరో లైన్‌లోని గుంటూరు జిల్లా ల్యాబ్ అండ్ ఎక్సరే ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో అధ్యక్షుడు ఆనం సంజీవరెడ్డి ఆధ్వర్యంలో స్వాతంత్ర దినోత్సవాన్ని నిర్వహించారు. వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రావణబాబు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఆయన మాట్లాడుతూ స్వాతంత్య్ర సాధనకు ఎందరో ప్రాణ త్యాగం చేశారని, వారిని స్మరించుకోవడం మన బాధ్యతని తెలిపారు. గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ డివిజనల్ ఇంజనీర్ రఫీ మాట్లాడుతూ నేటి ఈ అభివృద్ధికి పునాది మన స్వాతంత్ర ఉద్యమకారులేదని గుర్తు చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి తాడేకూరు శ్రీహరిబాబు, గ్లోబల్ లక్ష్మణ్, నేషనల్ ఎక్సరే కృష్ణ, అయూబ్ ఖాన్, బాబ్జి పాల్గొన్నారు.

మహనీయులను స్మరించుకోవాలి

బజరంగ్ ఫౌండేషన్ సీఈవో అంబటి మురళీకృష్ణ

కొరిటిపాడు(గుంటూరు): దేశం కోసం ప్రాణాలర్పించిన మహనీయుల్ని ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని బజరంగ్ ఫౌండేషన్ సీఈవో అంబటి మురళీకృష్ణ అన్నారు. భారత జాతి ఐక్యంగా సాగించిన పోరాటాల ఫలితంగా లభించిన స్వేచ్ఛా, స్వాతంత్య్రాల ఫలాల్ని మరింత అప్రమత్తత, సమైక్యతా భావనతో నిలబెట్టుకోవాలన్నారు. దాన్ని ప్రతి పౌరుడూ తన బాధ్యతల్ని నిబద్ధతతో నెరవేర్చాలని సూచించారు. పట్టాభిపురంలోని బజరంగ్ కార్యాలయంలో 77వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా మురళీకృష్ణ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ దేశ స్వాతంత్య్రం కోసం పోరాటం సాగించిన మహానీయుల్ని స్ఫూర్తిగా తీసుకొని వారి అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని పిలుపునిచ్చారు. బజరంగ్ నిర్మాణ సంస్థ సామాజిక సేవను కూడా త్రికరణశుద్ధితో నిర్వహిస్తూ, తన వంతు సామాజిక బాధ్యతను సంపూర్ణంగా నిర్వహిస్తోందని వెల్లడించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రం నమోదు చేస్తున్న పురోగతి అసామాన్యమని కొనియాడారు. కార్యక్రమంలో బజరంగ్ ఫౌండేషన్ డైరెక్టర్లు జి.సుబ్బారావు, ఎస్.శ్రీనివాసరావు, ఎస్.సమీర్‌నందన్, ప్రాజెక్టు మేనేజర్ సుధాకరరెడ్డి పాల్గొన్నారు.



కార్యాలయంలో జెండా వందనం చేస్తున్న సీఈవో మురళీకృష్ణ

గుంటూరు రైల్వే శాఖ ఆధ్వర్యంలో మిన్నంటిన వేడుకలు

లక్ష్మీపురం: గుంటూరు నల్లపాడు రైల్వే పెరేడ్ గ్రౌండ్‌లో మంగళవారం డీఆర్‌ఎం ఎం.రామకృష్ణ నేతృత్వంలో 77వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన జాతీయ పతాకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఆర్‌పీఎఫ్, జీఆర్పీ, ఐఆర్పీ సిబ్బంది, రైల్వే గుంటూరు డివిజనల్ శాఖధిపతులు జాతీయ జెండాకు సెల్యూట్ చేశారు. డీఆర్‌ఎం ఎం.రామకృష్ణ రైల్వే పోలీసులను కలసి అభివాదం పలికారు. ఆయన మాట్లాడుతూ గుంటూరు జిల్లాలో కూడా దేశ పోరాటంలో అమరులైన వారు ఎందరో ఉన్నారని గుర్తు చేశారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన వారి ప్రతి ఒక్కరినీ ఈ రోజు ప్రతి ఇంటా స్మరించుకోవాలని చెప్పారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించారు. డివిజన్‌లో సంబంధిత విభాగాధిపతులకు, ఉద్యోగులకు డీఆర్‌ఎం అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో గుంటూరు రైల్వే డివిజనల్ ఏడీఆర్‌ఎంలు శ్రీనివాస్, సైమాన్, సీనియర్ డీసీఎం దినేష్‌కుమార్, రైల్వే సిబ్బంది పాల్గొన్నారు.



రైల్వే పోలీసులకు అభివాదం చేస్తున్న గుంటూరు డీఆర్‌ఎం రామకృష్ణ

అంగరంగ వైభవంగా స్వాతంత్య్ర వేడుకలు

- ఆకట్టుకున్న శకటాల ప్రదర్శనలు
- కనువిందు చేసిన చిన్నారుల నృత్యాలు



ఆకట్టుకున్న ప్రభుత్వ శకటాలు





గుంటూరు వెస్ట్ /పాత గుంటూరు: 77వ స్వాతంత్య్ర వేడుకలు మంగళవారం స్థానిక పోలీసు పెరేడ్ గ్రౌండ్‌లో అంగరంగ వైభవంగా జరిగాయి. చిన్నారుల నృత్యాలు, లయబద్ధమైన సంగీతం, ఆకర్షణీయమైన అలంకరణతో అదనపు సొగబగులు అలుముకున్నాయి. దేశభక్తితోపాటు, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు ఆహూతుల్ని అలరించాయి. జిల్లా అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల్ని వివరిస్తూ ప్రభుత్వ శాఖల శకటాల ప్రదర్శన కనువిందు చేసింది. వ్యవసాయ, ఏపీఎంపీ, ఉద్యాన, పశు సంవర్ధక, జిల్లా నీటి యాజమాన్య సంస్థ, గృహ నిర్మాణం, పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, విద్యా, గ్రామీణ నీటిసరఫరా, పారిశుద్ధ్య, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమం, వైద్యం, రాష్ట్ర విపత్తు, స్పందన, అగ్నిమాపక శాఖల శకటాల ప్రదర్శన ప్రగతికి అద్దం పట్టేలా ఉన్నాయి. శకటాల ప్రదర్శనలో పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖకు మొదటి బహుమతి, విద్యా శాఖకు రెండో బహుమతి, నీటి యాజమాన్య సంస్థకు మూడో బహుమతి లభించాయి.

ఆసక్తిగా ఛాయా చిత్ర ప్రదర్శన

భారత దేశ స్వాతంత్య్ర సమరం, స్వాతంత్య్ర సమరయోధులు, ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా జిల్లా యంత్రాంగం చేపట్టిన కార్యక్రమాలపై జిల్లా సమాచార పౌర సంబంధాలశాఖ, పర్యాటక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఛాయా చిత్ర ప్రదర్శనను జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాలరెడ్డి, జిల్లా ఎస్పీ ఆరీఫ్ హఫీజ్, సంయుక్త కలెక్టర్ జి. రాజకుమారి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, అడిషనల్ ఎస్పీ సుప్రజ, డి.ఆర్.ఓ. కె.చంద్రశేఖరరావు తిలకించారు. ఛాయా చిత్ర ప్రదర్శనలో ఫొటోల్ని విద్యార్థులు, అధికారులు, ప్రజలు ఆసక్తిగా తిలకించారు.

అలరించిన ప్రదర్శనలు

వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్ ఆకట్టుకున్నాయి. జిల్లా వ్యవసాయ శాఖ, ఎ.పి. మార్క్‌ఫెడ్, జలవనరుల శాఖ, పశుసంవర్ధక శాఖ, లీడ్ బ్యాంకు, వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ, విద్యా శాఖ, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, గృహ నిర్మాణ శాఖ, నగరపాలక సంస్థ, పంచాయతీరాజ్, మత్స్యశాఖ, మైనారిటీ సంక్షేమ శాఖ మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ, విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ తదితర శాఖల ఆధ్వర్యంలో ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల్ని వివరిస్తూ ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థకు ప్రథమ బహుమతి, నాబార్డుకు రెండో బహుమతి, వ్యవసాయ శాఖకు మూడో బహుమతి లభించింది.

వీరమాతలకు సన్మానం

దేశ సేవలో అమరులైన సైనికుల వీరమాతలు జి. విజయలక్ష్మి, సుబ్బమ్మ, జానకీని సన్మానించారు. అమర వీరుల త్యాగాలను దేశం ఎల్లప్పుడూ గుర్తుంచుకుంటుందని కలెక్టర్ ఎం. వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు.

భళా... సాంస్కృతిక కార్యక్రమాలు

నగరంలోని వివిధ పాఠశాలల ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. స్వాతంత్య్రోద్యమంలో అమర వీరులకు వందనాలు తెలుపుతూ దేశభక్తి పాటలకు నృత్య ప్రదర్శనలు చేశారు. అనంతరం సభలో కలెక్టర్ ఎం. వేణుగోపాలరెడ్డి ఉత్తమ ప్రదర్శనలు ఇచ్చిన పాఠశాలలకు బహుమతులు అందించారు. యాదవ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలకు ప్రథమ బహుమతి, హిందూ హైస్కూల్‌కు రెండో బహుమతి, సెయింట్ జోసఫ్ బాలికల ఉన్నత పాఠశాల, మున్సిపల్ ప్రాథమికోన్నత పాఠశాల, ప్రభుత్వ బాలుర పాఠశాలకు మూడో బహుమతి లభించాయి. ఇస్రో నిర్వహించిన యంగ్ ఇండియన్ సైంటిస్ట్ పోటీల్లో ఎంపికైన జిల్లాకు చెందిన ఐదుగురు విద్యార్థులకు మెమెంటోలు అందించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, ఎమ్మెల్సీలు చంద్రగిరి ఏసురత్నం, కె.ఎస్. లక్ష్మణరావు, ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్‌రావు, కుమ్మరి సాలివాహన కార్పొరేషన్ చైర్మన్ మండేపూడి పురుషోత్తం, డెప్యూటీ మేయర్ షేక్ సజీల, వైఎస్సార్ సీపీ నాయకులు మద్దిరెడ్డి సుధాకర్‌రెడ్డి, షేక్ షౌకత్, మేరుగ విజయలక్ష్మి, వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తరగతి గదిలో భావి భారత నిర్మాణం

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి. రామకృష్ణప్రసాద్

గుంటూరు ఎడ్యుకేషన్: బావి భారత నిర్మాణం పాఠశాలల తరగతి గదుల్లోనే రూపుదిద్దుకుంటుందని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ అన్నారు. లక్ష్మీపురం మెయిన్ రోడ్డులోని శ్రీ పాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ స్కూల్లో నిర్వహించిన మంగళవారం నిర్వహించిన స్వాతంత్య్ర దినోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జస్టిస్ రామకృష్ణప్రసాద్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ముందుగా ఆయన పాఠశాల వెలుపల ఉన్న ప్రముఖ స్వాతంత్య్ర సమరయోధుడు పాటిబండ్ల సీతారామయ్య కాంస్య విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజోపయోగ కార్యక్రమాలతో సామాజిక సేవా తత్పరునిగా తరించిన పాటిబండ్ల సీతారామయ్య చిరస్మరణీయులని, ఆయన్ను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ఈసందర్భంగా విద్యార్థులు శాస్త్రీయ నృత్య, దేశభక్తి గీతాలాపన, తైక్వాండో, యోగా, కర్రసాము ప్రదర్శన, మతాలన్నీ ఒకటే అని చాటి చెప్పేలా ప్రదర్శించిన నృత్య రూపకం ఆకట్టుకుంది. కార్యక్రమంలో పాఠశాల కమిటీ గౌరవాధ్యక్షుడు డాక్టర్ యలమంచిలి శివాజీ, కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్, ఉపాధ్యక్షుడు డాక్టర్ సూర్యదేవర హనుమంతరావు, సభ్యులు గింజుపల్లి వరప్రసాదరావు, మాదల రాజేంద్రప్రసాద్, మదమంచి రవీంద్ర, బొల్లేపల్లి శ్రీనివాస్, చిలుకూరి నరేంద్రబాబు, డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సీతారామయ్య విగ్రహానికి నివాళులర్పించిన జస్టిస్ రామకృష్ణప్రసాద్ తదితరులు

బాలికను మోసం చేసిన యువకుడి అరెస్టు

పెదకాకాని: బాలికకు మాయమాటలు చెప్పి మోసం చేసిన యువకుడ్ని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. మండలంలోని వెనిగండ్ల గ్రామానికి చెందిన తోకల ప్రసాద్ ఓ మైనర్‌తో ప్రేమ పేరుతో వెంట పడుతున్నాడు. గతంలో కూడా నడవడిక మార్చుకోవాలని బాలిక తల్లిదండ్రులు హెచ్చరించారు. అయినప్పటికీ అతని ప్రవర్తనలో మార్పు రాలేదు. ఈనెల 9న బాలిక కనిపించకపోవడంతో పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. ఈనెల 11న బాలిక తల్లి ఫిర్యాదు మేరకు ప్రసాద్‌పై పోక్సో కేసు నమోదు చేశారు. ఈ మేరకు అతడ్ని అరెస్టు చేసి మంగళవారం కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు.

క్యాంపు కార్యాలయంలో మొక్కలు నాటిన కలెక్టర్ కుటుంబం



మొక్కలు నాటుతున్న జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డి, కుటుంబ సభ్యులు

గుంటూరు వెస్ట్: 77వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి, కుటుంబ సభ్యులు స్థానిక కలెక్టర్ బంగ్లాలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఒక మొక్కను నాటడమంటే ప్రకృతికి మనవంతు సాయం అందించడమేనని తెలిపారు. తల్లిదండ్రులు వారి పిల్లలకు మొక్కలు నాటడంతో పాటు, వాటిని కాపాడడం ఎంత ముఖ్యమో చిన్నప్పటి నుంచే వివరించాలని సూచించారు. వీలైనంత వరకు ప్రతి ఇంటిలోనూ మొక్కలు నాటడం అలవర్చుకోవాలని కోరారు.

మహాత్మునికి జేసీ నివాళులు

స్థానిక కలెక్టరేట్‌లోని మహాత్మా గాంధీ చిత్రపటానికి జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి ఘనంగా నివాళులు అర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి అలంకరించారు. స్వాతంత్య్ర పోరాటంలో మహాత్ముని పాత్ర ఎంత చెప్పినా తక్కువేనని కీర్తించారు.